నేడు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాక

అనకాపల్లి, అల్లూరి జిల్లాల నేతలతో సమావేశం



అనకాపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రదేశ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం జిల్లాకు రానున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి మూడు గంటలకు అనకాపల్లి చేరుకుంటారు. అనంతరం రింగ్‌రోడ్డులోని ...మిగతా 6వ పేజీలో



రైల్వే జోన్‌పై రాజకీయం!

జోనల్ కార్యాలయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల్లో భూములు అప్పగిస్తే మరుసటి రోజే శంకుస్థాపన చేస్తామన్న రైల్వే మంత్రి

- ముడసర్లోవలో 52 ఎకరాలు తీసుకోవచ్చునంటూ డీఆర్‌ఎంకు జీవీఎంసీ మునిసిపల్ కమిషనర్ లేఖ
- అందులో 20 ఎకరాలు నీటి వనరులు ఉన్నాయంటూ ప్రస్తావన
- లేఖ రాసినంత మాత్రాన భూములు అప్పగించినట్టు కాదంటున్న రైల్వే అధికారులు
- అందులో ఆక్రమణలు కూడా తొలగించలేదని ఆక్షేపణ
- ..ఇటువంటి తరుణంలో ఫిబ్రవరిలో శంకుస్థాపన అంటూ అనకాపల్లి ఎంపీ ప్రకటన
- ఎన్నికల ముందు శంకుస్థాపనకు బీజేపీ నేతల పట్టు



ముడసర్లోవలో రైల్వే జోన్‌కు ఇవ్వడానికి జీవీఎంసీ అధికారులు ప్రతిపాదించిన భూములు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలతో రాజకీయ నాయకులు ఆటలాడుకుంటున్నారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని మూడు దశాబ్దాలుగా ప్రజా పోరాటం చేస్తుంటే...ప్రధాని నరేంద్రమోదీ గత ఎన్నికల ముందు 2019లో 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అప్పటి నుంచీ ఆయనే ప్రధానిగా ఉన్నా ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలు సమీపించడంతో దానిపై రాజకీయ నాయకులు తలో మాట చెబుతున్నారు.

కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ గత నెల (డిసెంబరు) 10వ తేదీన విశాఖపట్నం వచ్చినప్పుడు జోన్ గురించి ప్రశ్నిస్తే... కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన భూములు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వమే జాప్యం చేస్తున్నదని ఆరోపించారు. భూములు వారం రోజుల్లో అప్పగిస్తే ఆ మరుసటిరోజే తాను భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తానని ప్రకటించారు. ఇక్కడే మరో ముడి పడింది. రైల్వేకు భూములు అప్పగించాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌కు, జీవీఎంసీకి అప్పగించింది. ఆ రోజున కలెక్టర్ మల్లికార్జున, కమిషనర్ సాయికాంత్‌వర్మ వారం రోజుల్లో ముడసర్లోవ భూములను అప్పగిస్తామని రైల్వే మంత్రికే హామీ ఇచ్చారు. ఇదంతా విశాఖ బీజేపీ నాయకుల సమక్షంలో జరిగింది. ఇచ్చిన హామీ నిలుపుకున్నామని చెప్పడానికి జీవీఎంసీ అధికారులు 'ముడసర్లోవలో 52 ఎకరాల భూములు సిద్ధంగా ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకోవచ్చు' అంటూ డీఆర్‌ఎంకు ఓ లేఖ రాశారు. 'ఆ భూముల్లో 20 ఎకరాల్లో నీటి వనరులు ఉన్నాయి.' అంటూ ఇంకో వాక్యం జత చేశారు. దీంతో తమ బాధ్యత తీరిపోయినట్టుగా, భూములు ... మిగతా 6వ పేజీలో



సీలేరులో సమావేశమైన ఇరు రాష్ట్రాల అధికారులు

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

జలాశయంలో నీటి నిల్వ 54.1196 టీఎంసీలు

ఆంధ్రా వాటా 25.5230, ఒడిశా వాటా 28.5966 టీఎంసీలు

లెక్కలు తేల్చిన ఇరు రాష్ట్రాల అధికారులు

సీలేరు, జనవరి 23: ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలమెల జలాశయం నీటి వినియోగంపై ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల అధికారులు మంగళవారం జీకేవీధి మండలం సీలేరు ఏపీ జెన్‌కో అతిథి గృహంలో సమావేశమై చర్చించారు. 2023- 2024 నీటి సంవత్సరంలో ఇప్పటి వరకు తమ వాటాగా ఏయే రాష్ట్రం ఎంతెంత నీటిని వినియోగించుకుందో లెక్కించారు. 2023 డిసెంబరు 31 నాటికి (2022- 2023 నీటి సంవత్సరంలో ఏపీ అదనంగా వినియోగించుకున్న 13.7578 టీఎంసీల నీటితో కలిపి) 38.8517 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు, అలాగే ఒడిశా 2023 డిసెంబరు 31 నాటికి 35.7780 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు లెక్కలు తేల్చారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో 54.1196 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు లెక్కలు కట్టారు.

ఈ నీటి నిల్వల్లో ఆంధ్రా వాటాగా 25.5230 టీఎంసీలు, ఒడిశా వాటాగా 28.5966 టీఎంసీలుగా పంపకాలు చేశారు. ప్రస్తుతం ఇరు రాష్ట్రాల విద్యుత్, వ్యవసాయ అవసరాల నిమిత్తం ఆంధ్రా మూడు వేల క్యూసెక్కుల నీటిని, ఒడిశా 1500 క్యూసెక్కుల నీటిని వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సమావేశంలో ఒడిశా తరపున పొట్టేరు చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ పిటాబాస్‌సేతి, ఎస్ఈ రమాకాంత్‌పాత్రో, ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దుర్గేస్ మోహర్, మేనేజర్ విజయ్‌కుమార్ శెట్టి తుషార్‌రంజన్(ఏఈఈ, సివిల్), గడాధర్ ప్రధాన్ (ఏఈ సివిల్)లు పాల్గొనగా, ఆంధ్రా తరపున ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్, ఈఈ ప్రభాకరరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటమధు, ఏఈఈ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో మంచు

మన్యం గజగజ

తగ్గని చలి తీవ్రత

జి.మాడుగులలో 13.6 కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

పాడేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మన్యంలో చలి తీవ్రత కొనసాగుతున్నది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతున్నప్పటికీ చలి మాత్రం తగ్గడం లేదు. దీంతో ఏజెన్సీ వాసులు వణుకుతున్నారు. జి.మాడుగులలో 13.6, పాడేరు, హుకుంపేట, జీకేవీధిలో 14.4, అరకులోయలో 14.5, డుంబ్రిగుడలో 14.6, పెదబయలులో 14.9 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు మంగళవారం నమోదయ్యాయి. మరి కొన్ని రోజులు ఇదే వాతావరణం కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచిస్తున్నది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో పాటు ఉత్తరాది మీదుగా చలిగాలులు వీస్తుండడంతో చలి తీవ్రత కొనసాగుతున్నది. ఏజెన్సీలో తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు దట్టంగా పొగ మంచు కమ్మేస్తుంది. దీంతో లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించకతప్పడం లేదు. మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా మాత్రమే ఎండ కాస్తున్నది. సాయంత్రం మూడు గంటల నుంచే చలి ప్రభావం చూపుతున్నది. దీంతో ఏజెన్సీ వాసులు చలి మంటలు కాగుతూ, ఉన్ని దుస్తులు ధరిస్తూ చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదు కావడంతో చలి పెరిగింది. జిల్లా వ్యాప్తంగా పది హేను రోజులుగా పది నుంచి 15 డిగ్రీలు మధ్యలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావం వల్ల ఏజెన్సీ వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. మంగళవారం చింతపల్లిలో 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. నెలాఖరు వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఏజెన్సీలో చలితో పాటు మంచు దట్టంగా కురుస్తున్నది. ఉదయం పది గంటల వరకు గిరిజన గ్రామాల్లో సూర్యుడు కనిపించడం లేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలి తీవ్రత కొనసాగుతోంది.



పాడేరు-చింతపల్లి మార్గంలో మంగళవారం ఉదయం పొగమంచు



సమ్మె విరమిస్తున్నట్టు సీడీపీవోకు లిఖితపూర్వకంగా తెలుపుతున్న అంగన్‌వాడీలు

నేటి నుంచి విధుల్లోకి అంగన్‌వాడీలు

సమ్మె విరమించినట్టు సీడీపీవోలకు లిఖిత పూర్వక సమాచారం

పాడేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 42 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు మంగళవారం విరమించారు. చలో విజయవాడ ఆందోళన నేపథ్యంలో అంగన్‌వాడీల సంఘం నేతలతో ప్రభుత్వ పెద్దలు జరిపిన చర్చలు సఫలం కావడంతో మంగళవారం నుంచి సమ్మె విరమిస్తున్నట్టు యూనియన్ నేతలు ప్రకటించారు. ఇందులో భాగంగా మంగళవారం అంగన్‌వాడీల సమ్మె శిబిరాల్లోనే విజయోత్సవ కార్యక్రమాలను నిర్వహించి, అనంతరం తాము సమ్మెను విరమించి విధుల్లో చేరుతామని సీడీపీవో ఝూన్సీకి లిఖితపూర్వకంగా తెలిపారు. దీంతో బుధవారం నుంచి అంగన్‌వాడీలు పూర్తిస్థాయిలో విధుల్లో చేరనున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యలకు పరిష్కారం చూపకుంటే, మళ్లీ సమ్మె చేపడతామని ... మిగతా 6వ పేజీలో

చంద్రబాబు భరోసాతో ఉత్సాహం



అరకు సభలో చంద్రబాబు (ఫైల్)

గిరిజన యువతలో చిగురిస్తున్న ఆశలు

గిరిజన ప్రాంతాల్లో నూరుశాతం ఉద్యోగాలు గిరిజనులకేనన్న బాబు

జీవో 3 పునరుద్ధరణకు అరకు సభలో హామీ

రంపచోడవరం, జనవరి 23: జగన్ ప్రభుత్వ తీరుతో నైరాశ్యంలో ఉన్న గిరిజన యువతకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పర్యటన ఉద్యోగ భరోసాను కల్పించి కొత్త ఆశలను చిగురింపజేసింది. ఈ నెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో నిర్వహించిన 'రా కదలి రా' కార్యక్రమంలో జీవో నంబరు 3 పునరుద్ధరణకు చంద్రబాబు హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో అన్ని ఉద్యోగాలూ గిరిజనులకే దక్కేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వం దివంగత ఎన్టీరామారావు సారథ్యంలో 1986లోనే నడుం బిగించింది. అన్ని ఉపాధ్యాయ పోస్టులూ గిరిజనులతోనే భర్తీ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ పలు కేసులు నడిచాయి. తెలుగుదేశం ప్రభుత్వం కూడా అంతే దీటుగా గిరిజనులకు అండగా నిలిచి సుప్రీంకోర్టు వరకూ పోరాడింది. రాజ్యాంగపరంగా గిరిజనులకు అండగా ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని 2000 సంవత్సరంలో అన్ని ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులకే దక్కే విధంగా జీవో నెం.3ను తీసుకొచ్చి, 1986 నుంచి వర్తించేలా గిరిజన యువతకు రక్షణ కల్పించింది. ఇదే పరంపరను క్రమేణా అన్ని పోస్టులకు వర్తింపచేస్తూ వచ్చారు. అనేక నియామకాలు ఆ జీవో పరిధిలోనే చేపడుతూ గిరిజన ప్రాంతాల్లో ఉండే గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను పెంచుతూ వచ్చారు.

ఆ జీవోపై కూడా పలు కేసులు దాఖలయ్యాయి. మూడు దశాబ్దాల కాలంగా గిరిజన యువత ఉద్యోగాలకు భరోసాగా నిలిచిన ఆ జీవోపై చేబ్రోలు లీలా ప్రసాదరావు కేసులో ప్రభుత్వ వైఫల్య వాదనల కారణంగా చివరకు 2020 ఏప్రిల్‌లో ఆ జీవో సుప్రీంకోర్టులో వీగిపోయింది. ఆ తీర్పుతో గిరిజన యువతకు గిరిజన ప్రాంతాల్లో నూరుశాతం ఉద్యోగ భరోసా ప్రశ్నార్థకమైంది. జనాభా ప్రాతిపదికన కేవలం 6నుంచి 7శాతం మాత్రమే గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు గిరిజనులకు దక్కే దుస్థితి కలిగింది. గిరిజనులకు అండగా నిలవాల్సిన వైసీపీ ప్రభుత్వం ఆ జీవోను పునరుద్ధరించే దిశగా సరైన చర్యలు తీసుకోలేకపోయింది. ఈ పరిస్థితుల్లో విద్యావంతులైన ... మిగతా 6వ పేజీలో



అద్దరవీధిలో రైతులు విక్రయానికి సిద్ధం చేసిన జాఫ్రా గింజలు

జాఫ్రా రైతు హ్యాపీ

పెరిగిన ధర ▸▸ కిలో రూ.90కి ప్రైవేటు వర్తకులు కొనుగోలు

చింతపల్లి, జనవరి 23: మన్యంలో జాఫ్రా (అన్నటో) ధరలు పెరిగాయి. ప్రైవేటు వర్తకులు కిలో జాఫ్రా గింజలను రూ.90 ధరకు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది కంటే అధిక ధర లభించడంతో ఆదివాసీ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఆదివాసీ రైతులు పంట పొలాల గట్లపై జాఫ్రాను సాగు చేస్తున్నారు. జాఫ్రా మొక్కల ఆకులను పశువులు ఆహారంగా తీసుకోవు. దీంతో రైతులు ప్రధానంగా పంట పొలాల గట్లపై కంచె గాను, మరో వైపు అదనపు ఆదాయం కోసం జాఫ్రా మొక్కలను సాగు చేసుకుంటున్నారు. జాఫ్రా గింజలను సహజ రంగుల్లో ఉపయోగిస్తారు. ఆర్గానిక్ కావడంతో పలు రకాల వంటకాల్లో జాఫ్రాను విరివిగా ఉపయోగిస్తుంటారు. జాఫ్రా గింజలకు అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో రూ.100కి పైగా ధర లభిస్తున్నది. దీంతో ప్రైవేటు వర్తకులు కిలో జాఫ్రాను రూ.90 ధరకు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది కిలో జాఫ్రా గింజలను కేవలం రూ.50- 55లకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది మార్కెట్ ప్రారంభంలోనే జాఫ్రాకు మంచి ధర లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రిపబ్లిక్ డే వేడుకలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, తదితరులు

రిపబ్లిక్ డే ఏర్పాట్ల పరిశీలన

పాడేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను మంగళవారం ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాట్లపై ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. వేదిక, స్టాల్స్ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనువుగా ఉండేలా అన్నీ ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజు, డీఈఈ పి.అనుదీప్, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, ప్రధానోపాధ్యాయుడు ఆర్.జాన్, తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి టన్నుల కాఫీ గింజల కొనుగోలు లక్ష్యం

ఆదివాసీ రైతులకు అంతర్జాతీయ ధరలు

డౌనూరులో రూ.ఐదు కోట్లతో ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్

వచ్చే ఏడాది అరకు బ్రాండింగ్‌పై మార్కెట్‌లోకి ఇన్‌స్టంట్ కాఫీ

జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేశ్‌కుమార్



ఎర్రచెరువుల గ్రామంలో గిరిజన రైతులతో మాట్లాడుతున్న ఎండీ సురేశ్‌కుమార్

చింతపల్లి, జనవరి 23: జిల్లాలో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) వెయ్యి టన్నుల కాఫీ గింజలు కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేశ్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి చింతపల్లిలో బస చేసిన ఆయన మంగళవారం జీకేవీధి మండలంలోని శివారు పెదవలస, ఎర్రచెరువులు, మాడెం గ్రామాలతో పాటు చింతపల్లి మండలంలోని చిక్కుడుబట్టి, కిటుములు, బౌడ గ్రామాలను సందర్శించారు. ఆదివాసీ కాఫీ రైతులతో స్వయంగా మాట్లాడి కాఫీ గింజల కొనుగోలు, ధరలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీ రైతులకు అపెక్స్ కమిటీ సిఫారసు చేసిన అంతర్జాతీయ ధరలను జీసీసీ అందిస్తున్నదన్నారు. కిలో పార్చిమెంట్ రూ.280, చెర్రీ రూ.145, రొబస్టా రూ.70 ధరలకు కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ప్రైవేటు వర్తకులు జీసీసీ కంటే రూ.30-40 తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఆదివాసీ రైతులు పండించిన కాఫీ గింజలను జీసీసీకి ... మిగతా 6వ పేజీలో

క్రైం... crime news

ఆటో అదుపుతప్పి బోల్తా: మహిళ మృతి

» మరో నలుగురికి తీవ్ర గాయాలు


మృతిచెందిన చలంశెట్టి నాగమణి

కశింకోట, జనవరి 23: మండలంలో బయ్యవరం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఆటో బోల్తా పడిన ఘటనలో ఒక మహిళ మృతిచెందింది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి సీఐ కె.వినోద్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన చలంశెట్టి నాగమణి(53), గల్లా లక్ష్మి, బొద్దపు సత్యవతి, మరో నలుగురు మహిళలు కలిసి మంగళవారం తెల్లవారుజామున ఒక ఆటోలో అనకాపల్లి కూరగాయల మార్కెట్‌కు బయలుదేరారు. అప్పటికే మంచు దట్టంగా కురుస్తుండడంతో విజిబిలిటీ తగ్గిపోయింది. 4.30 గంటల సమయంలో కశింకోట మండలం బయ్యవరం వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ అతి సమీపానికి వచ్చే వరకు కనిపించకపోవడంతో ఆటో డ్రైవర్ ఆకస్మికంగా బ్రేకులు వేశాడు. దీంతో ఆటో బోల్తా పడింది. చలంశెట్టి నాగమణి తలకు తీవ్రగాయమవడంతో అక్కడికక్కడే మృతిచెందింది. నలుగురు తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు పంపారు. కాగా వీరంతా రోజూ అనకాపల్లి మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసి, వాటిని చిన్నపాటి క్యారీ బ్యాగుల్లో ప్యాకింగ్ చేసి రైళ్లలో ప్రయాణికులకు అమ్ముతూ జీవనం సాగిస్తుంటారు. మృతురాలు నాగమణి చిన్న కుమార్తె లగిశెట్టి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మద్యం మత్తులో గ్యాస్ సిలిండర్‌పై పడి ఒకరి మృతి

గొలుగొండ, జనవరి 23: మద్యం మత్తులో గ్యాస్ సిలిండర్‌పై పడిన ఓ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ నారాయణరావు మంగళవారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తమల్లంపేట గ్రామంలో కిల్లాడ నానాజీ(50)అనే వ్యక్తి మద్యం మత్తులో ఇంట్లో గ్యాస్ సిలిండర్‌పై పడి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి నానాజీ మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలిండర్‌పై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఆయన తెలిపారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు


రహదారి పక్కకు దూసుకుపోయిన కారు

జి.మాడుగుల, జనవరి 23: మండలంలోని కె.కోడాపల్లి కవలపూలు గ్రామ సమీపంలో ఎదురెదురుగా ప్రయాణిస్తున్న కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం జి.మాడుగుల మండలం గొప్పులపాలెం గ్రామానికి చెందిన జగ్గం దొర అర్జున్(36), సింహాచలం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతున్నారు. అదే సమయంలో జి.మాడుగుల నుంచి పాడేరు వెళుతున్న కారు కె.కోడాపల్లి కవలపూలు గ్రామ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో అర్జున్ సంఘటన స్థలంలో మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సింహాచలాన్ని 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సింహాచలం ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

కారు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలు

లంకెలపాలెం, జనవరి 23: కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పరవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సబ్బవరం గ్రామానికి చెందిన ఎం.బాలాజీ, ఎస్.జగదీశ్, జె.విజయ్‌కుమార్‌లు ద్విచక్ర వాహనంపై మడకపాలెం నుంచి వస్తున్నారు. లంకెలపాలెం నుంచి సబ్బవరం వెళ్లే దారిలో మంత్రిపాలెం జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5 మద్యం సీసాలు స్వాధీనం

లంకెలపాలెం, జనవరి 23: పాన్ షాపుపై పోలీసులు దాడి చేసి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. లంకెలపాలెం గ్రామానికి చెందిన జోగా అప్పారావు పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అయితే మద్యాన్ని విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ సురేశ్, పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అప్పారావుపై కేసు నమోదు చేశారు.

మోటారు సైకిల్ చోరీ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కశింకోట, జనవరి 23: మండలంలోని జి.భీమవరంలో మోటారు సైకిలు దొంగిలించిన కేసులో ముగ్గురు ముద్దాయిలకు ఒక సంవత్సరం నాలుగు నెలలపాటు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారని సీఐ కె.వినోద్‌బాబు తెలిపారు. బైక్ చోరీకి గురైనట్టు 2020 జనవరి 1న ఫిర్యాదు అందిందని, దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శుభాల గడారి, సుభాశ్ గడారి, ఆబలా బరిక్‌లను అరెస్టు చేసి చేశారు. పలు వాయిదాల అనంతరం నిందితులు నేర చేసినట్టు రుజువు కావడంతో వీరికి 16 నెలలపాటు జైలు శిక్ష విధిస్తూ 12వ ఏఎంఎం కోర్టు జడ్జి బి.వి.విజయలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు.

బీసీలకు సీఎం జగన్ మోసం

» తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత ధ్వజం


మాట్లాడుతున్న అనిత

ఎస్.రాయవరం, జనవరి 23 : నా బీసీలు అంటూ వారిని అడ్డంగా మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ధ్వజమెత్తారు. మండలంలోని రేవుపోలవరంలో మంగళవారం సాయంత్రం పల్లె పలకరింపు, జయహో బీసీ సమావేశ కార్యక్రమాలను ఆమె నిర్వహించారు. ఇందులో తొలుత గ్రామంలోని అన్ని వీధుల్లోని ఇంటింటికి తిరుగుతూ అనిత టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. అనంతరం నిర్వహించిన జయహో బీసీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బీసీల అభివృద్ధికి పెద్దపీట వేశారని, తరువాత బీసీలకు అన్ని విధాలా సహకరించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో బీసీ కార్పొరేషన్ ద్వారా ఎన్నో రుణాలను చంద్రబాబు ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, నాయకులు గింజాల లక్ష్మణరావు, ఎన్. వెంకటరాజు, అల్లు నరసింహమూర్తి, కోడా లోవరాజు, గంపల అప్పన్న, చోడిపల్లి బంగారి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌కు నోటీసులు

విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి చెందిన ఎమ్మెల్సీ సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్‌కు శాసన మండలి చైర్మన్ నోటీసులు జారీచేశారు. ఆయన ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఈ నేపథ్యంలో 'ఒక పార్టీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికై, వేరే పార్టీలోకి మారిన మీపై ఎందుకు అనర్హత వేటు వేయకూడదో చెప్పాలంటూ' నోటీసు పంపించారు. ఇది వారం రోజుల క్రితమే వచ్చినట్టు తెలిసింది. దీనికి సమాధానం ఇవ్వడానికి తనకు పది రోజుల వ్యవధి కావాలని వంశీకృష్ణ కోరినట్టు సమాచారం.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

'సౌత్'లో వైసీపీకి ఎదురుగాలి

ఎన్నికల ముంగిట నియోజకవర్గంలో అయోమయ పరిస్థితి

- ఇప్పటికే ఇద్దరు కార్పొరేటర్లు పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిక
- ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానానికి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ కూడా గుడ్‌బై
- వాసుపల్లికి టికెట్ ఇస్తే సహకరించబోమంటున్న కార్పొరేటర్లు
- ఇటీవల నలుగురిని సస్పెండ్ చేసినట్టు ప్రకటించిన అధిష్ఠానం
- నాలుగు రోజుల క్రితం శాసనసభ్యుడు ఏర్పాటుచేసిన సమావేశానికి ఒకే ఒక్క కార్పొరేటర్ హాజరు
- మరోవైపు సొంత సామాజికవర్గంలోనూ వాసుపల్లిపై వ్యతిరేకత
- తాజా పరిణామాలతో అయోమయంలో కార్యకర్తలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముంగిట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గంలో పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను వచ్చే ఎన్నికల్లో పోటీకి దింపాలని నిర్ణయించిన తర్వాత ఒకరి తర్వాత ఒకరు కార్పొరేటర్లు పార్టీకి దూరమవుతున్నారు. సీఎం పర్యటనపై ఆయన ఇటీవల ఏర్పాటుచేసిన సమావేశానికి ఒకే ఒక్క కార్పొరేటర్ హాజరయ్యారు. మరోవైపు ఎమ్మెల్యేపై సొంత సామాజికవర్గం నుంచి కూడా తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

2019 ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి గెలిచిన వాసుపల్లి గణేష్‌కుమార్ తర్వాత వైసీపీ పంచన చేరారు. అయితే అప్పటికే వైసీపీలో ఉన్న నేతలకు, వాసుపల్లికి మధ్య సఖ్యత కుదరలేదు. దక్షిణ నియోజకవర్గంలో 12 వార్డులు పూర్తిగా, రెండు వార్డులు పాక్షికంగా ఉండగా జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ ఏడింటిని గెలుచుకుంది. మూడు టీడీపీ, ఒకటి జనసేన దక్కించుకోగా, మూడుచోట్ల ఇండిపెండెంట్లు గెలుపొందారు. ఫలితాలు వచ్చిన తర్వాత ఇండిపెండెంట్లుగా గెలిచిన ముగ్గురితోపాటు టీడీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్ ఒకరు వైసీపీలో చేరడంతో వైసీపీ బలం నియోజకవర్గంలో 11కి పెరిగింది. అయితే అందులో కొందరు మొదటి నుంచి వాసుపల్లిని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో వాసుపల్లికి టికెట్ ఇస్తున్నట్టు అధిష్ఠానం పరోక్షంగా ప్రకటించడంతో నియోజకవర్గంలో ముసలం మొదలైంది. వాసుపల్లి వ్యవహారశైలి బాగోలేదంటూ...ఇండిపెండెంట్లుగా గెలిచి వైసీపీలో చేరిన 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ పార్టీని వీడి జనసేనలో చేరిపోయారు. ఇక పార్టీ ఆవిర్భావం నుంచి ఉండి, ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానానికి పోటీ చేసిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ కూడా వాసుపల్లితో కలిసి పనిచేయలేనంటూ రెండు వారాల కిందట వైసీపీకి రాజీనామా చేశారు. అదేవిధంగా వాసుపల్లికి టికెట్ ఇస్తే సహకరించబోమని 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్‌తోపాటు ఇండిపెండెంట్‌గా గెలిచి వైసీపీకి మద్దతుగా నిలిచిన 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పలుమార్లు బహిరంగంగానే ప్రకటించారు. వైసీపీకి రాజీనామా చేసిన సీతంరాజు సుధాకర్‌తో వారం రోజుల కిందట నలుగురు కార్పొరేటర్లు విలేకరుల సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే వాసుపల్లిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా పరిగణించి ఆ నలుగురు కార్పొరేటర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. దీనివల్ల మిగిలిన కార్పొరేటర్లు వాసుపల్లికి వ్యతిరేకంగా మాట్లాడరని పార్టీ పెద్దలు భావించినప్పటికీ మరో ముగ్గురు కార్పొరేటర్లు కూడా పార్టీని వీడిపోవాలనే యోచనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈనెల 19న ఎమ్మెల్యే వాసుపల్లి తన కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలు విస్తృతస్థాయి సమావేశానికి 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఒక్కరే హాజరయ్యారు. 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, టీడీపీ నుంచి గెలిచి తర్వాత వైసీపీకి మద్దతుగా నిలిచిన 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండలు గైర్హాజరయ్యారు. వాసుపల్లిపై కార్పొరేటర్లలో ఉన్న వ్యతిరేకతకు అంతకంటే నిదర్శనం ఏం కావాలని ఆయన వ్యతిరేక వర్గం ప్రచారం ప్రారంభించింది.

మరోవైపు వాసుపల్లికి సొంత సామాజికవర్గంలో కూడా మద్దతు కరువైంది. ఆయనకు టికెట్టు ఇవ్వొద్దని, ఒకవేళ ఇచ్చినా తాము సహకరించబోమంటూ ఆ మధ్య మత్స్యకార సంఘ నేతలు బహిరంగంగానే ప్రకటించారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోందని, అధిష్ఠానం కూడా నివారణ చర్యలపై దృష్టిసారించకుండా మొండిగా ముందుకువెళుతోందంటూ పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల కట్టడికి
సీసీ కెమెరాలు దోహదం

- ఎంపీ డాక్టర్ సత్యవతి
- 17 కూడళ్లలో ఏర్పాటుచేసిన 40 సీసీ కెమెరాలు ప్రారంభం


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి


సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి, కలెక్టర్

అనకాపల్లి టౌన్, జనవరి 23: శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాలకు పాల్పడిన వారిని త్వరగా పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. అనకాపల్లి పట్టణంలో వివిధ చోట్ల రూ.10 లక్షల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన 40 సీసీ కెమెరాలను మంగళవారం రాత్రి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలిసి ఆమె ప్రారంభించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో విధి నిర్వహణలో వున్న పోలీసుల స్పందనను వీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ, ఏ సంఘటన జరిగినా పోలీసులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టడానికి సీసీ కెమెరాలు దోహదపడతాయని చెప్పారు. కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి మాట్లాడుతూ, బొజ్జన్నకొండ రోడ్డుతోపాటు ముఖ్యమైన ప్రదేశాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ, పట్టణంలోని 17 ప్రధాన కూడళ్లలో 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ విజయభాస్కర్, అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, ట్రైనీ డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐలు జి.శంకరరావు, నీలయ్య, పైడపునాయుడు, వినోద్‌బాబు, రవికుమార్, వైసీపీ అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, డాక్టర్ కె.విష్ణుమూర్తి పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్వరరావు పిలుపు
- పార్టీ కార్యాలయంలో లోకేశ్ జన్మదిన వేడుకలు


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు

అనకాపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ఓటు ద్వారా చరమ గీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువగళం పాదయాత్ర ద్వారా లోకేశ్ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారని, తండ్రికి తగ్గ తనయుడిగా భవిష్యత్తులో ప్రజారంజక పాలన అందిస్తారని అన్నారు. త్వరలో టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని, రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందని చెప్పారు.

అనంతరం కేక్ కట్ చేసి, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తరువాత ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరుచూరి భాస్కరరావు, టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, డాక్టర్ కేకేవీపీ నారాయణరావు, మాదంశెట్టి నీలబాబు, కోట్ని రామకృష్ణ, కాయల మురళి తదితరులు పాల్గొన్నారు.

గంగవరంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు
- ఎక్సకవేటర్ సీజ్, గ్రావెల్ తవ్వకందారునిపై కేసు
- రూ.30 వేలు అపరాధ రుసుము విధింపు


గంగవరంలో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

సబ్బవరం, జనవరి 23: మండలంలోని గంగవరంలో (జీవీఎంసీ 88వ వార్డు) జగనన్న కాలనీకి అనుకొని ఉన్న లే-అవుట్‌లో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, రూ.30 వేలు అపరాధ రుసుము విధించినట్టు మైనింగ్ రాయల్టీ అధికారి స్వాతి చెప్పారు. ఇందుకు సంబంధించి ఆమె వెల్లడించిన వివరాలిలా వున్నాయి.. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం గంగవరం గ్రామానికి చెందిన రైతు జనపరెడ్డి రామునాయుడు నుంచి సర్వే నంబరు 57లో కొంత భూమిని ప్రభుత్వం సమీకరించింది. జగనన్న కాలనీ పేరుతో లేఅవుట్ వేసిన అధికారులు... రామునాయుడుకు పరిహారం కింద కొంత స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలం చదును పేరిట కొన్ని రోజులుగా రామునాయుడు మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి అమ్ముకుంటున్నాడు. స్థానికులు కొందరు ఈ విషయాన్ని మీడియా ప్రతినిధులకు తెలియపరిచారు. విలేకరులు గంగవరంలో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రదేశం వద్దకు వెళ్లగా, జనపరెడ్డి రామునాయుడు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడాడు. దీంతో విలేకరులు మైనింగ్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. మైనింగ్ శాఖ రాయల్టీ అధికారి స్వాతి, వీఆర్వో వెంకటేశ్ వచ్చి పరిశీలించారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వి, ఇక్కడి నుంచి తరలించినందుకు రామునాయుడుపై కేసు నమోదు చేశారు. అంతేకాక రూ.30 వేలు అపరాధ రుసుము విధించారు. గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించనున్నట్టు ఆమె చెప్పారు.

జగన్, షర్మిల రాజకీయ డ్రామాలు

» డీబీపీ రాష్ట్ర అధ్యక్షురాలు అన్నపూర్ణ ఆరోపణ

పాయకరావుపేట, జనవరి 23: అన్నాచెల్లెళ్లయిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చెరో పార్టీలో వుంటూ రాజకీయ డ్రామాలకు తెరలేపారని దళిత బహుజన పార్టీ (డీబీపీ) రాష్ట్ర అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ ఆరోపించారు. మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి ఆంధ్రులకు తీరని ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీకి, నాడు పార్లమెంటులో మద్దతు ఇచ్చిన బీజేపీకి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీకి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆమె ధ్వజమెత్తారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, వైఎస్ఆర్ పేరు చెప్పుకుంటూ రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు.

రేపటి నుంచి చోడవరంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 23: అనకాపల్లి జిల్లా చోడవరం మండలం అంకుపాలెంలో ఈ నెల 25 నుంచి రాష్ట్ర స్థాయి మహిళల, జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజేశ్వరి, అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కనకదుర్గ అమ్మవారి పరస సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచే జట్లకు రూ.40 వేలు, రూ.30 వేలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే వారికి రూ.20 వేలు, రూ.పది వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. అదేవిధంగా జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ పోటీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచే జట్లకు రూ.20 వేలు, 15 వేలు, పది వేలు, ఐదు వేల రూపాయిల చొప్పున అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల జట్లు 7680005666 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

డ్వాక్రా సంఘాలకు రూ.273.56 కోట్లు ఆసరా

» నమూనా చెక్కు విడుదల చేసిన కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 23: వైఎస్ఆర్ ఆసరా పథకం (నాలుగో విడత రుణ మాఫీ) కింద జిల్లాలో జిల్లాలో 34,944 సంఘాలకు చెందిన 3,63,479 మంది మహిళలకు రూ.273.56 కోట్లు మంజూరైనట్టు కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి తెలిపారు. మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండలో నిర్వహించిన సభలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆసరా నిధులను బటన్ నొక్కి విడుదల చేయగా, ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సొమ్మును డ్వాక్రా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నమూనా చెక్కును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

2047నాటికి దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి

» సీనియర్ ఐఏఎస్ అధికారి పీయూష్ కుమార్



మాట్లాడుతున్న పీయూష్ కుమార్

ఎస్.రాయవరం, జనవరి 23: భారత దేశం 2047నాటికి పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధించాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని సీనియర్ ఐఏఎస్ అధికారి పీయూష్ కుమార్ అన్నారు. ఎస్.రాయవరంలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడుతూ, వచ్చే 25 సంవత్సరాల్లో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రజలందరూ సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలను అమలు చేస్తున్నదన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో పీఎం కిసాన్ పథకం ద్వారా 2,65,778 మంది రైతులు లబ్ధి పొందుతున్నారని, జల జీవన్ మిషన్ పథకం ద్వారా 2,63,000 ఇళ్లకు కొళాయిలు ఏర్పాటుచేశామని, హౌసింగ్ పథకం కింద 62,000 ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి జిల్లాలో తొమ్మిది లక్షల మందిని గుర్తించామని, వీరిలో ఇప్పటి వరకు 79 వేల మందికి కార్డులు పంపిణీ చేశామన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అధికారులు సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. పలువురు మహిళలకు వంట గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన జిల్లా అధికారులతోపాటు ఎంపీడీవో ఎస్‌వీ రామచంద్రమూర్తి, తహసీల్దార్ విజయకుమార్, డీటీ శ్యామ్, వైస్ ఎంపీపీలు బి.గోవిందరావు, అప్పన్న, జడ్పీటీసీ సభ్యురాలు కె.దేవి, సర్పంచ్ భూపతి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డిపో వద్ద గందరగోళం


ఇసుక డిపోవద్ద గుమిగూడిన వారితో మాట్లాడుతున్న ఎస్ఐ విభీషణరావు


ఇసుక కూపన్ల కోసం పడిగాపులు

నక్కపల్లి, జనవరి 23: నక్కపల్లి డిపో వద్ద సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకూ ఇసుక నిల్వలు లేకపోవడంతో ప్రజలు, జగనన్న కాలనీ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల కావల్సినంత ఇసుకను వందలాది లారీల్లో నక్కపల్లి డిపోకు తీసుకువచ్చారు. దీంతో ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఇసుక డిపో వద్ద రద్దీ ఏర్పడింది. ఒకవైపు జగనన్న కాలనీ లబ్దిదారులు, మరొకవైపు ట్రాక్టర్ల డ్రైవర్లు ఇసుక కోసం వెళ్లారు. ఇసుక డిపోవద్ద నిర్వహణ సంస్థ సిబ్బంది జగనన్న కాలనీలకు సంబంధించి నేరుగా లబ్ధిదారులే రావాలని మెలిక పెట్టారు. అప్పటికే వచ్చిన కొంతమంది లబ్ధిదారులు, ముఖ్యంగా మహిళలు గంటల కొద్దీ నిరీక్షించారు. ఇసుక ట్రాక్టర్ల యజమానులు లబ్ధిదారుల పేర్లతో కూపన్లు తెచ్చి తరలిస్తున్నారని సిబ్బంది కూపన్లు జారీలో తీవ్ర జాప్యం చేశారు. ఈ క్రమంలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకుని ఎస్ఐ విభీషణరావు ఉభయులతో మాట్లాడారు. ఇసుకకు సంబంధించి రోజుకు రెండు, మూడు ట్రిప్పులు ఇసుక కావాలంటే నేరుగా లబ్ధిదారులే అన్ని పర్యాయాలు రావడం కష్టమవుతుంది కదా ?అన్నారు. ట్రాక్టర్ యజమానులు కూడా తాము లబ్ధిదారుల కూపన్లతో వ్యాపారం చేయడం లేదని, ఎవరి కూపను వుంటే వారికే ఇసుక తోలుతున్నామని చెప్పారు. కేవలం ఒకసారి మాత్రం లబ్ధిదారులు వచ్చేలా చూసి, రద్దీ లేకుండా ఇసుక కూపన్లు ఇవ్వాలని ఎస్ఐ సిబ్బందికి సూచించడంతో గొడవ సద్దుమణిగింది.



టీడీపీలో చేరిన నాయకులకు కండువాలు వేసి ఆహ్వానిస్తున్న దొన్నుదొర

విజనరీ నేత చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

» టీడీపీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

అరకులోయ, జనవరి 23: విజనరీ నేత చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరిన పెదబయలు మండలం గిన్నెల కోట పంచాయతీ మాజీ సర్పంచ్, ముగ్గురు వార్డు సభ్యులు, గిన్నెలకోట, మెట్టగుడ, పిట్టలబొర్ర, చీమగెడ్డ, లండూరు, చింతగరువు తదితర గ్రామాల నాయకులకు మంగళవారం కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలకు నాయకులు, ప్రజలు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. అలాగే మన్యంలోవైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధి జాడ లేదని, సంక్షేమ పథకాల్లోనూ కోతలు విధించారని, అందుకే చాలా మంది నాయకులు, గిరిజనులు విసిగిపోయారని చెప్పారు. వారంతా టీడీపీలో చేరడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పెదబయలు మండల అధ్యక్షురాలు సీకరి సుకుమారి, పెదబయలు మాజీ ఎంపీపీ వి.కొండయ్య, లక్ష్మీపేట సర్పంచ్ లకే అశోక్‌కుమార్, గోమంగి, బొంగరం ఎంపీటీసీ సభ్యులు పి.భాస్కరరావు, నాయకులు సీకరి వెంకటరమణ, సత్తిబాబు, కోటేశ్వరరావు, లకే చిన్నారావు, లచ్చంగి వెంకట్రావు, కిల్లో రామన్న, ఎస్.చిన్నారావు, మనుగురు రామకృష్ణ, బి.గోపాల్‌రావు, వై.సింహాచలం, అప్పలస్వామి, జి.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

సోమ కుటుంబానికి చేసిన నష్టమేంటి?

అరకులోయ: సివేరి సోమ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ చేసిన నష్టమేంటని నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర ప్రశ్నించారు. తన స్వగృహంలో పార్టీ నేతలతో కలిసి మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సివేరి సోమ కుటుంబానికి పార్టీ రెండు సార్లు అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చి ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. సోమ ఒకసారి గెలిస్తే, రెండోసారి ఓడిపోయారని, అయినప్పటికీ పార్టీ అధికారంలో ఉండడంతో ఆ కుటుంబాన్ని పార్టీ అధినేత చంద్రబాబు ప్రోత్సహించారన్నారు. దురదృష్ట వశాత్తు మావోయిస్టుల దాడిలో సోమ మృతి చెందడంతో, ఆ కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడంతో పాటు అతని కుమారుడు అబ్రహంకు ఎస్టీ కమిషన్ సభ్యుడిగా అవకాశం కల్పించిన విషయం మరచిపోకూడదని దొన్నుదొర పేర్కొన్నారు. తాజాగా తనకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి టిక్కెట్ ప్రకటిస్తే అబ్రహం వ్యతిరేకించడంతో పాటు విమర్శలు చేయడం సరికాదన్నారు. అంతేకాకుండా అరకులో నిర్వహించిన బహిరంగ సభలో అబ్రహం, శ్రావణ్‌కుమార్‌కు తగిన ప్రాధాన్యత ఇస్తామని పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించిన విషయం గుర్తు చేసుకోవాలని చెప్పారు. అయినప్పటికీ తనతో పాటు చంద్రబాబుపై సోషల్ మీడియా వేదికగా రకరకాలుగా ట్రోల్ చేయడం సమంజసం కాదని దొన్నుదొర పేర్కొన్నారు.

రేషన్ సరకుల వ్యాన్‌లో కట్టెల రవాణా

జి.మాడుగుల, జనవరి 23: ఇంటింటికీ రేషన్ సరకులు సరఫరా చేసే వాహనంలో వంట చెరకు తరలిస్తున్నారు. పాలమామిడి పంచాయతీకి చెందిన రేషన్ వాహనం నిర్వాహకుడు వనభంగిపాడు గ్రామంలో ఉంటూ.. తరచూ తన ఇంటికి ఉపయోగపడేలా కట్టెలు పట్టుకు వెళ్తుండడాన్ని స్థానికులు తప్పుబడుతున్నారు. ఈ వాహనాన్ని నిర్వాహకుడు ఇటీవల సొంత పనులకు ఉపయోగించే క్రమంలో ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురై వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయని వారు చెప్పారు.



వనభంగిపాడులో కట్టెలు తరలిస్తున్న వ్యాన్

వెయ్యి టన్నుల కాఫీ గింజల కొనుగోలు లక్ష్యం

...3వ పేజీ తరువాయి



ఎర్రచెరువుల గ్రామంలో గిరిజన రైతులతో మాట్లాడుతున్న ఎండీ సురేశ్‌కుమార్

విక్రయించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పాడేరు, చింతపల్లి డివిజన్ల పరిధిలో ఇప్పటికే 200 టన్నుల పార్చిమెంట్ కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం చెర్రీ సీజన్ ప్రారంభమైందన్నారు. గత ఏడాది జిల్లాలో వెయ్యి టన్నుల కాఫీ గింజలు కొనుగోలు చేశామన్నారు. ఈ ఏడాది అదే లక్ష్యంతో కొనుగోలు ప్రారంభించామని, అయితే ఈ ఏడాది ఆశించిన దిగుబడులు రైతులకు రాలేదని చెప్పారు. జీసీసీకి కాఫీ గింజలను విక్రయించిన రైతులకు వెంటనే నగదు వారి వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు జమ చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.ఐదు కోట్ల నగదు రైతులకు చెల్లించామన్నారు. ఆదివాసీ రైతులు కాఫీ గింజలను జీసీసీ ద్వారా మార్కెటింగ్ చేసుకుని మంచి ధర పొందాలని, దళారీలను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు.

వచ్చే ఏడాది అరకు బ్రాండ్‌పై ఇన్‌స్టంట్ కాఫీ

వచ్చే ఏడాది అరకు బ్రాండ్‌పై గిరిజన సహకార సంస్థ ఉత్పత్తి చేసిన ఇన్‌స్టంట్ కాఫీ పొడిని మార్కెట్‌లోకి తీసుకొస్తామని మేనేజింగ్ డైరెక్టర్ సురేశ్‌కుమార్ తెలిపారు. ఏపీలోనే తొలిసారిగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూ.ఐదు కోట్ల జీసీసీ నిధులతో కొయ్యూరు మండలం డౌనూరు వద్ద ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం సివిల్ వర్కు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే ఏడాదికి ఈ యూనిట్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ యూనిట్ వద్దనే క్యూరింగ్, హల్లింగ్, పౌడర్, ప్యాగింగ్ చేసే అత్యాధునిక యంత్ర సామగ్రిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే ఆదివాసీ కాఫీ ఉత్పత్తులకు ధర మరింతగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి డీఎం పి. దేవరాజు, కాఫీ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చంద్రబాబు భరోసాతో ఉత్సాహం

...3వ పేజీ తరువాయి

గిరిజన యువత ప్రభుత్వ నియామకాలు పొందలేని స్థితిలో మైదాన ప్రాంతాలకు వలసపోతూ చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి భరోసా లేక గిరిజన యువత దిక్కుతోచని స్థితిలో కుంగిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నెల 20న అరకులోయకు వచ్చిన చంద్రబాబు ఈ అంశంపై దృష్టి సారించి తమ ప్రభుత్వం గిరిజన యువతకు నూరుశాతం ఉద్యోగ భరోసా కల్పిస్తూ ఇచ్చిన జీవోను జగన్ ప్రభుత్వం కాపాడలేకపోయిందని, తద్వారా గిరిజన యువత భవిష్యత్తును దెబ్బతీసిందని ఆక్షేపించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే జీవో 3 పునరుద్ధరణకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీంతో గిరిజన యువతలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కాగా, జీవో 3 పునరుద్ధరణ హామీ ద్వారా గిరిజన యువతకు తమ పార్టీ భరోసా కల్పిస్తోందని, భవిష్యత్తుకు గ్యారంటీ విధానంలోనే గిరిజన యువతకు చంద్రబాబు అండగా నిలుస్తున్నారని టీడీపీ సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేశ్, వంతల రాజేశ్వరి తెలిపారు.

నేటి నుంచి విధుల్లోకి అంగన్‌వాడీలు

...3వ పేజీ తరువాయి

వారు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమ్మె, ఆందోళనలకు మద్దతుగా నిలిచిన విపక్ష నేతలు, సంఘాలు, మీడియాకు అంగన్‌వాడీలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎల్.సుందరరావు, అంగన్‌వాడీల సంఘం నేతలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చిన్నారి, అంబిక, విజయలక్ష్మి, ఇంద్ర, కుమారి, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.







పాడేరులో మోదకొండమ్మకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తదితరులు... లోకేశ్ జన్మదిన వేడుకల కేక్ కట్ చేస్తున్న పాడేరు నాయకులు

లోకేశ్ యువగళంతో నూతనోత్సాహం

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

» ఏజెన్సీలో వాడవాడలా ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు

పాడేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళంతో యువతలో కొత్త ఉత్సాహం వచ్చిందని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. మంగళవారం లోకేశ్ జన్మదిన వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. స్థానిక మోదకొండమ్మకు గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయం ఆవరణలోనే కేకును కట్ చేసి పార్టీ శ్రేణులకు పంపిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువనేత లోకేశ్ యువగళంతో వైసీపీ నేతల్లో వణుకు పుట్టిందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనపై యువగళంలో లోకేశ్ ప్రజల్ని చైతన్యం చేస్తున్న తీరు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన స్ఫూర్తితో పార్టీ నేతలు, తెలుగు యువత మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు డప్పోడి వెంకటరమణ జి.సింహాచలం, జి.శివకుమార్, కె.రమేశ్‌నాయుడు, కె.రామునాయుడు, వి.కొండలరావు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నేత కిల్లు వెంకటరమేశ్‌నాయుడు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. జిల్లా ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. తమ నేత లోకేశ్ స్ఫూర్తితో ముందుకు సాగుతామని వెంకటరమేశ్‌నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నరసింహమూర్తి, బొంజుపడాల్, ఉల్లి రామారావు, లైదయ్య, వెంకటేశ్వర్లు, బీమేశ్, బాలరాజు పాల్గొన్నారు. టీడీపీ నేత కొట్టగుల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకల కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలమ్మ, పిన్నయ్యదొర, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: లోకేశ్ జన్మదినం సందర్భంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద కేక్ కటింగ్ చేసి అందరికీ పంచిపెట్టారు. యువ నేత అడుగు జాడలో నడుచుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పార్టీ మండల అధ్యక్షుడు కె.బలరాం, నాయకులు జి.రామ్మూర్తి, కె.సన్యాసమ్మ, వి.లక్ష్మణ్, కె.శివశంకర్, వి.రామస్వామి, ఎస్.బాబూజీ, పి.రమేశ్, వి.చిన్ని, ఎం.చిన్నిబాబు, శంకరావు పేర్కొన్నారు.

కొయ్యూరు: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేయించి అందరికీ పంచారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మాల మాకవరంలో పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి, మండల అధ్యక్షుడు జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాయ కులు ఎం.బాలరాజు, కె.చంద్రరావు, ఎం.చిన్న, ఎం.భార్గులయ్య, అనిశెట్టి నాగేశ్వరరావు, వి.రాము, ఉబ్బల రాజేశ్, లోత మల్లేశ్వరావు, వీర్రాజు, కె.కాంతం, పి.ప్రసాద్, సిహెచ్.ప్రసాద్, కాకురు ఈశ్వరమ్మ, పెద మల్లయ్య, మణి పాల్గొన్నారు.

అరకులోయ: మండల కేంద్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పి.దాసుబాబు, ఉపేంద్ర, మహదేవ్, శ్యాం, విజయనిర్మల , బొరిబొరి లక్ష్మీ, నీరజ, నాగరాజు, త్రినాథ్ తదితరులు మహిళలకు చీరలు, ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పాలు, పండ్లు పంపిణీ చేశారు.



అరకులోయలోని గొందివలసలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దొన్నుదొర, పార్టీ నాయకులు

85,167 మంది సభ్యులకు ఆసరా లబ్ధి

పాడేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 85,167 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆసరా లబ్ధి చేకూరుతుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి నాలుగో విడత ఆసరా సొమ్ము జమ కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడారు. జిల్లాలో 8,664 స్వయం సహాయక సంఘాల్లోని 85,167 మంది సభ్యులకు ఆసరా పథకంలో భాగంగా రూ.34.06 కోట్ల నగదును సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జమ చేశారన్నారు. అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 2,295 స్వయం సహాయక సంఘాలకు రూ.7.67 కోట్లు, పాడేరు నియోజకవర్గంలో 1,521 సంఘాలకు రూ.6.25 కోట్లు, రంపచోడవరం నియోజకవర్గంలో 4,848 సంఘాలకు రూ.20.14 కోట్లు నగదు జమ చేసినట్టు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మితో కలిసి ఆయన ఆసరా పథకం నమూనా చెక్కును ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళి, వెలుగు సిబ్బంది స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో కలిసి నమూనా చెక్కు ప్రదర్శిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వైసీపీ పాలనలో అరకు అన్నింటా వెనుకబాటు

» కాంగ్రెస్ పార్టీ నాయకుడు శెట్టి గంగాధర్‌స్వామి

అరకులోయ, జనవరి 23: వైసీపీ పాలనలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అరకు ప్రాంతం అన్నింటా వెనుకబడిపోయిందని కాంగ్రెస్ పార్టీ నేత శెట్టి గంగాధర్‌స్వామి ఆరోపించారు. మండల కేంద్రంలోని ఓ రిసార్ట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అరకు పేరున గిరిజన యూనివర్శిటీ వస్తే వైసీపీ ప్రభుత్వం మైదాన ప్రాంతం సాలూరుకు తరలించిందని చెప్పారు. అలాగే మెడికల్ కళాశాల అరకుకు కేటాయిస్తే పాడేరుకు తరలించుకుపోయారని, ఇంజనీరింగ్ కళాశాల అరకుకు కేటాయిస్తే కురుపాంలో పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం అరకు అంటూనే పాడేరులో పెట్టారన్నారు. రుషికొండను బోడిగుండు చేసినట్టుగా, అరకులోయకు గుడ్డు సున్నా మాదిరిగా ఏమీ లేకుండా చేశారని గంగాధరస్వామి వాపోయారు. అలాగే స్థానిక నాయకులను కాదని ఇతర ప్రాంతాల వారికి టిక్కెట్లు ఇవ్వడం సరికాదన్నారు. అరకుకు పర్యాటకంగా ఎంతో ప్రాచుర్యం ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయలేకపోయిందన్నారు. ఈ నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి వైసీపీ ప్రభుత్వం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేకపోవడంతోనే పార్టీని వీడి, తమ ప్రియతమ నేత రాజశేఖరరెడ్డి బిడ్డ షర్మిల కాంగ్రెస్ పగ్గాలు చేపట్టడంతో సొంత గూటికి వెళ్లిపోయానని చెప్పారు. తన ప్రాణం ఉన్నంత వరకూ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానన్నారు. అరకు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున టిక్కెట్‌కు దరఖాస్తు చేస్తానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాకా బాబూరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్‌స్వామి, నాయకులు

జ్వరాలు తగ్గాలని పూజలు

» మూఢ నమ్మకాన్ని వీడని ఆదివాసీలు

» చైతన్యపరచడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలం

గూడెంకొత్తవీధి, జనవరి 23: తరాలు మారినా ఆదివాసీలు ఇప్పటికీ మూఢ నమ్మకాలను వీడడం లేదు. వ్యాధులు నయం కావాలని ఇప్పటికీ పూజలు చేస్తూ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రతిష్ఠాత్మకంగా ఫ్యామిలీ ఫిజీషియన్, ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. సాధారణ జ్వరంతో బాధపడుతున్న ఆదివాసీలు సైతం సర్కారు వైద్యంపై నమ్మకంలేక నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. పాలకులు, అధికారులు సైతం ప్రభుత్వ వైద్యంపై ఆదివాసీలను చైతన్యపరచడంలో పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. జీకేవీధి పంచాయతీ జి.కొత్తపాలెం గ్రామంలో స్థానిక గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రతి కుటుంబంలోనూ జ్వర పీడితులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఇద్దరు జ్వర పీడితులకు నయంకావాలని పూజారి (గొరవడు) రహదారిపై పూజలు చేసిన కోడిపిల్లను బలి ఇచ్చాడు. ఆస్పత్రిలో ఇచ్చిన మందులు వేసుకుంటున్నప్పటికీ జ్వరం తగ్గడం లేదని, అందు వల్ల జ్వర పీడితులకు వ్యాధి తగ్గాలని పూజలు చేస్తున్నామని గొరవడు చెప్పాడు. పూజలు చేస్తే వ్యాధి తగ్గుతుందని తమ నమ్మకమని ఆదివాసీ జ్వర పీడితులు తెలిపారు. ఆదివాసీలు మూఢ నమ్మకాన్ని విడిచిపెట్టి, సర్కారు వైద్యంపై నమ్మకం పెంచేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



జ్వర బాధితుడికి వ్యాధి నయం కావాలని పూజలు చేస్తున్న పూజారి

రైల్వే జోన్‌పై రాజకీయం!

... 3వ పేజీ తరువాయి

అప్పగించినట్టుగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోంది.

రైల్వే వర్గాలు ఏమంటున్నాయంటే...?

ముడసర్లోవ భూముల్లో ఆక్రమణదారులు ఉన్నారని, వారిని అక్కడి నుంచి పంపించి ఆ భూములు అప్పగించాలని తాము కోరితే...ఆ విషయం ప్రస్తావించకుండా వాటిని స్వాధీనం చేసుకోవాలని లేఖ రాయడం ఆశ్చర్యంగా ఉందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా కొత్తగా ఆ భూముల్లో 20 ఎకరాల్లో నీటి వనరులు ఉన్నాయని చెబుతున్నారని కూడా ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఈ లేఖ అందిన తరువాత అక్కడికి వెళ్లి పరిశీలిస్తే ఆక్రమణదారులు అలాగే ఉన్నారని, నీటి వనరులు ప్రస్తుతానికి ఏమీ లేవని, వర్షాలు పడితే నీరు చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. 52 ఎకరాల్లో 20 ఎకరాలు నీటి వనరులైతే...32 ఎకరాలనే ఉపయోగించుకోవలసి ఉంటుందని, అవి కూడా ఆక్రమణలు తొలగించాకే ఇవ్వాల్సి ఉంటుందని అంటున్నారు. లేఖ రాస్తే భూములు అప్పగించినట్టు ఎలా అవుతుందని, వాటికి సంబంధించిన పత్రాలు ఇవ్వాలని, అటువంటిదేమీ ఇప్పటివరకు జరగలేదని రైల్వే అధికారి ఒకరు తెలిపారు.

ఎన్నికల ముందు శంకుస్థాపనకు బీజేపీ నేతల పట్టు

గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయని, జోన్ ఏర్పాటుకు రూ.106 కోట్లు కేటాయించినా, పనులు ప్రారంభించకపోవడంపై సమాధానం చెప్పుకోలేకపోతున్నామని ఉత్తరాంధ్ర బీజేపీ నాయకులు ఢిల్లీలో మొర పెట్టుకుంటున్నారు. జోన్ కార్యాలయాల శంకుస్థాపనకు ఏదో ఒక తేదీ ప్రకటించాలని కేంద్ర నేతలను కోరుతున్నారు. అందుబాటులో ఉన్న భూముల్లోనే ఎక్కడో ఓ చోట శంకుస్థాపన చేస్తే కొంత వరకు ప్రజలకు సమాధానం చెప్పుకునే వెసులుబాటు ఉంటుందని చెబుతున్నట్టుగా సమాచారం.

కొణతాల మాటలకు కౌంటర్‌గా ఎంపీ సత్యవతి ప్రకటన

మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ జనసేన పార్టీలో చేరడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం అనకాపల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో రైల్వే జోన్ హామీ నిలుపుకోలేదని విమర్శించారు. దీనికి కౌంటర్‌గా అనకాపల్లి ఎంపీ సత్యవతి సోమవారం అక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి, ఫిబ్రవరిలోనే రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరుగుతుందని ప్రకటించారు. అది రాజకీయ విమర్శలను తిప్పికొట్టడానికి చేసిన ప్రకటనే తప్ప ఏమాత్రం వాస్తవం లేదని, దానిపై ఇంతవరకు తమకు ఎటువంటి సమాచారం లేదని రైల్వే వర్గాలు స్పష్టం చేశాయి.

నోరు మెదపని విశాఖ నాయకులు

విశాఖపట్నంలో రైల్వే జోన్‌పై వైసీపీకి చెందిన నాయకులు గానీ, బీజేపీలో హడావుడి చేస్తున్న నాయకులు గానీ ఇప్పుడు ఏమీ మాట్లాడడం లేదు. వైసీపీ నాయకులైతే అది తమకు సంబంధించిన విషయం కాదన్నట్టుగానే వ్యవహరిస్తున్నారు. జోన్ పనుల ప్రారంభంపై ఇక్కడ ఏ నాయకుడికీ స్పష్టమైన సమాచారం లేకపోవడం గమనార్హం.

☛ సంక్షిప్తంగా..

పారా వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో న్యాయ సహాయకులుగా పని చేసేందుకు గాను పారా వలంటీర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి జి.స్వర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత పొంది, సమాజానికి సేవ చేయాలనే ఆసక్తి వున్న యువత పారా వలంటీర్లుగా పని చేసేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. ఆసక్తి వున్న యువత ఈ నెల 31వ తేదీలోగా స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు.

చంద్రబోస్‌కు ఘన నివాళులు

పాడేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఏఐఎస్ఎఫ్ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ స్వాతంత్ర ఉద్యమంలో సాగించిన సాయుధ పోరును స్మరించుకున్నారు. అలాగే కేంద్రం తీసుకువచ్చిన నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కె.రాజశేఖర్, చినబాబు, నాయుడు, కృష్ణ, అనిల్, రాజు, ఈశ్వర్ పాల్గొన్నారు.

26న అడ్డాకుల ప్లేట్ల తయారీ కేంద్రం ప్రారంభం



ప్లేట్ల తయారీ కేంద్రం పనులు పరిశీలిస్తున్న పీవో

పాడేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులో ఈ నెల 26న అడ్డాకులతో ప్లేట్లు తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ప్రకటించారు. వన్‌దన్ వికాస కేంద్రం ఆధ్వర్యంలో సిద్ధమవుతున్న అడ్డాకులతో ప్లేట్లు తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. భవనానికి తుది మెరుగులు దిద్ది, యంత్ర పరికరాలను త్వరగా ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అధికారులను పీవో ఆదేశించారు. గిరిజనులు సేకరించిన అడ్డాకులతో ప్లేట్లు, గ్లాసులు, సాసర్లు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు

తెరచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

అరకులోయ, జనవరి 23: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు మంగళవారం తెరచుకున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు విధులకు హాజరయ్యారు. మరి కొంత మంది అంగన్‌వాడీలు అరకులోయలో విజయోత్సవ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలదేవ్, అంగన్‌వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దురియా నాగమ్మ, మండల ప్రతినిధులు నిర్మల, వెంకటలక్ష్మి, లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి విడనాడి రాష్ట్ర నేతలతో చర్చలు జరపడం, పలు డిమాండ్లను అంగీకరించడంతో సమ్మె విరమించినట్టు చెప్పారు. చర్చల్లో ఒప్పందాలను మాట తప్పకుండా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, అరకులోయలో అంగన్‌వాడీలు ధింసా నృత్యంతో విజయోత్సవాలను చేసుకున్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

చింతపల్లి, జనవరి 23: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. అంగన్‌వాడీల సంఘటిత పోరాటంతోనే ప్రభుత్వం దిగివచ్చిందని పేర్కొన్నారు. డిసెంబరు 12 నుంచి 42 రోజుల పాటు సమ్మె చేస్తూ ఆందోళనలు ఉధృతం చేశారని, ప్రభుత్వం స్పందించకపోవడంతోనే ఇలా సుదీర్ఘ పోరాటం చేయాల్సి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లకు గురిచేసినా బెదిరిపోకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు పోరాడడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.ధనుంజయ్, చిరంజీవి పడాల్, పెంటమ్మ, రాములమ్మ, సెగ్గె సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన అవసరం



ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

హుకుంపేట, జనవరి 23: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై అవగాహన అవసరమని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణారావు స్పష్టం చేశారు. మండలంలోని మఠం పంచాయతీ కేంద్రంలో మంగళవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్ విషయంలోని జాతీయ ఎన్నికల కమిషన్‌కు పలు అభ్యంతరాలు, ఫిర్యాదులు అందిన నేపథ్యంలో పలు సూచనలు చేసిందని చెప్పారు. వీటిపై ప్రజలకు అపోహలు లేకుండా ఉండేందుకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. సర్పంచ్ శాంతి కుమారి మాట్లాడుతూ యంత్రాలపై ఓటింగ్ విషయంలో ఓటర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఓటు హక్కును సక్రమంగా వియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కొండబాబు, వార్డు సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాక

... 3వ పేజీ తరువాయి

ఒక ప్రైవేటు కన్వెన్షన్ హాలులో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన పార్టీ నాయకులతో సమావేశమవుతారు. సుమారు రెండు గంటలపాటు పార్టీ శ్రేణులతో మాట్లాడతారు. అనంతరం గాజువాక బయలుదేరి వెళతారు. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి అనకాపల్లి జిల్లాకు వస్తున్న షర్మిలకు ఘనస్వాగతం పలకడానికి స్థానిక నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.